క్లుప్తంగా

పాఠశాలల భద్రతపై దృష్టి సారించాలి



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల భద్రతపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని ఎంఈవో-2 బీఎస్వీ బ్రహ్మాచారి కోరారు. మంగళవారం మండలంలోని బూరుగుగూడెం యూపీ స్కూల్లో దాతలు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలల్లో అసాంఘిక కార్యక్రమాలను నిరోధించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంగిడి చెన్నారావు, ఉపాధ్యాయులు బక్కయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా గోడౌన్‌లో తనిఖీలు



నూజివీడు: బాణసంచా గోడౌన్‌లలో పేలుడు పదార్థాలు నిల్వ చేసేటప్పుడు నిర్వాహకులు నిబంధనలు పాటించాలని నూజివీడు పట్టణ ఎస్‌ఐ నాగేశ్వరరావు సూచించారు. పట్టణంలోని ప్రసాద్ ఫైర్ క్రాకర్స్ గోడౌన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా జాగ్రత్తలు పాటించారా లేదా.. అనుమతి మేరకు బాణసంచా నిల్వచేశారా, అంతకంటే ఎక్కువ ఏమైనా ఉందా.. అని తనిఖీ చేశారు.

ఆధ్యాత్మిక ఆద్యుడు వాల్మీకి మహర్షి

ముసునూరు: ఆదికావ్యం రామాయణ రచనలతో ఆధ్యాత్మిక ఆద్యుడిగా వాల్మీకి మహర్షి చరిత్రలో నిలిచారని ఎంపీడీవో ఏసుబాబు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన వాల్మీకి మహర్షి జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామాయణ మహాకావ్య రచనతో మానవ జీవన విధానం, జీవిత విలువలను వాల్మీకి సమాజానికి చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, ఏవో ఛాయా కుమారి తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి పూలమాల వేసి వాల్మీకి గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో డీటీ విజయభాస్కర్, ఆర్‌ఐ సుజాత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ ఈవో హరిక్రిష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టాలని వినతి



ఇబ్రహీంపట్నం: ఎన్‌టీటీపీఎస్ నుంచి వెలువడుతున్న కాలుష్యం నివారణకు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు ఎన్‌టీటీపీఎస్ సీఈ శివ రామాంజనేయులను కోరారు. మంగళవారం నాయకులు ఎన్‌టీటీపీఎస్‌లోని సీఈ చాంబర్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు రేగళ్ల రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. ఎన్‌టీటీపీఎస్ బూడిద నీరు కృష్ణానదిలో కలవడం వల్ల తాగునీరు కలుషితం అవుతుందన్నారు. గ్రామాల్లో కాలుష్యం నివారణకు విరివిగా మొక్కలు పెంచాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ బీజేపీ అధ్యక్షురాలు టి.మాధురి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

మైలవరం: వెల్వడం గ్రామంలోని కరకట్ట ప్రాంతం ఎస్టీ కాలనీలో చలమచర్ల మధుకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం కాలిపోయింది. విషయం తెలుసుకున్న గ్రామ నాయకులు మంగళవారం కాలిపోయిన ఇంటిని పరిశీలించారు. బాధితుడికి నిత్యావసర సరకులు, వస్త్రాలు, నగదు సాయంగా అందజేశారు.

మద్యం దుకాణాల విస్తృత తనిఖీ

వీరులపాడు: ప్రభుత్వం నిర్దేశించిన మద్యం దుకాణాలలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం కొనుగోలు చేసి విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ అశ్రఫున్నీసా బేగం హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో భారీగా కల్తీ మద్యం పట్టుబడిన నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు మంగళవారం వీరులపాడు మండలంలోని మద్యం దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మద్యం నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ.. అక్రమ మద్యం విక్రయాలు చేసినా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లోయ గ్రామాలపై శీతకన్ను!

- పూర్తిగా ధ్వంసమైన రెండు రహదారులు
- సగంలో నిలిచిపోయిన స్టేట్ హైవే విస్తరణ పనులు
- క్రషర్లు, క్వారీల భారీ వాహనాలతో ఏర్పడుతున్న గుంతలు



గడ్డమణుగు ఎస్సీ కాలనీ మీదుగా మునగపాడు రోడ్డులో గుంతలు



గడ్డమణుగు గ్రామం వద్ద ధ్వంసమైన స్టేట్ హైవే

జి.కొండూరు: జి.కొండూరు నుంచి లోయ గ్రామాలుగా పిలువబడే గడ్డమణుగు, చెరువుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు గ్రామాల మీదుగా తెలంగాణ రాష్ట్రాన్ని కలుపుతూ స్టేట్ హైవే-242 ఉంది. అయితే జి.కొండూరు శివారు గెయిల్ ఇండియా కంపెనీ నుంచి గడ్డమణుగు ఎస్సీ కాలనీ మీదుగా మునగపాడుకు మరో రహదారి.. అదే విధంగా జి.కొండూరు పోలీసుస్టేషన్ నుంచి మునగపాడు వరకు బైపాస్ రహదారి కలదు. ఈ మూడు రహదారులు కూడా జి.కొండూరు నుంచి ప్రారంభమై మునగపాడు జంక్షన్ వద్ద కలుస్తాయి. అయితే స్టేట్ హైవే గతంలోనే పూర్తిగా ధ్వంసమైపోవడంతో లోయలో ఉన్న ఏడు గ్రామాల ప్రజలు, క్రషర్లు, క్వారీల నుంచి వచ్చే భారీ వాహనాలు గడ్డమణుగు ఎస్సీ కాలనీ మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పుడు ఈ రహదారి కూడా ధ్వంసమైపోయి భారీ గుంతలు ఏర్పడడంతో మునగపాడు నుంచి జి.కొండూరు పోలీసుస్టేషన్ వరకు ఉన్న బైపాస్ రహదారిపై రాకపోకలు సాగిస్తున్నారు. కాగా ఇది కూడా భారీ గుంతలు ఏర్పడి వాహనాలు రహదారిపైనే దిగబడిపోతున్నాయి. ఇక ఈ రహదారి కూడా ధ్వంసమైతే లోయ గ్రామాల ప్రజలు జి.కొండూరు రావాలంటే నడకయాతన పడాల్సిందే.

సగంలో నిలిచిన విస్తరణ పనులు..

కందులపాడు నుంచి జి.కొండూరు మీదుగా గంగినేని వరకు ఉన్న స్టేట్ హైవే-242 విస్తరణ పనులకు రూ.34.11కోట్లతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ ఆరు నెలలు తర్వాత పనులు ప్రారంభించారు. రెండో దశలో నిధులు విడుదలలో జాప్యం జరగడం, సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభం కావడంతో పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలల తర్వాత పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో 50 శాతం రహదారి విస్తరణ పనులు పూర్తి చేశారు. అయినప్పటికీ రూ.6 కోట్ల మేర బిల్లులను విడుదల చేయకపోవడంతో చేసేది లేక కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు.

రోడ్డును బాగు చేయాలి..



రోడ్ల దుస్థితి వల్ల లోయ గ్రామాలలో ప్రజలకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా విజయవాడ వైపు వెళ్లలేని దారుణమైన పరిస్థితులల్లో ఉన్నాం. ఆటోలు, కారులలో వెళ్లాలన్నా భారీ గుంతల వల్ల ఒల్లు గుల్లవుతుంది. గర్భిణులైతే ఆరోగ్య పరీక్షలకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రభుత్వం స్పందించి రోడ్లను బాగు చేయాలి.

– అన్నంశెట్టి వెంకట్రావు, గ్రామస్తుడు, గంగినేని

ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నాం..



రోడ్లు బాగోలేక వెళ్లాల్సిన ప్రయాణాలను వాయిదా వేసుకుంటున్నాం. జి.కొండూరు నుంచి మునగపాడు వరకూ మూడు రోడ్లు ఉన్నా ప్రయోజనం లేదు. రోడ్లన్నీ ధ్వంసమైపోయి నరకయాతన పడుతున్నాం. రాత్రి సమయాలలో ఈ రహదారిపై ప్రయాణం చాలా కష్టంగా ఉంది.

– పిల్లి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు, గంగినేని

కనీస వేతనాలు అమలుచేయాలి



చాట్రాయి పీహెచ్‌సీ వద్ద నిరసన చేస్తున్న ఆశా వర్కర్లు



కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా

చాట్రాయి: ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని మండల సీఐటీయూ కన్వీనర్ కంచర్ల రాంబాబు తెలిపారు. మంగళవారం చాట్రాయిలో ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలంటూ నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆశా వర్కర్లు 20 ఏళ్లుగా గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో పెరుగుతున్న నిత్యావసరాల ధరలతో కుటుంబాలను ఏవిధంగా పోషించుకుంటారని ఆయన ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఆశా వర్కర్ల జీతాలు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని నెరవేర్చలేదని మండిపడ్డారు.

తిరువూరు: తమ వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరుతూ ఎ.కొండూరు మండలం ఆశా వర్కర్లు మంగళవారం ఆందోళన చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా తమ వేతనాలు పెంచుతామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటికీ అమలుకు నోచలేదని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమల పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఎ.కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు, ఆశాలు పాల్గొన్నారు.

రీసర్వే అర్జీలపై గ్రామసభ రేపు

చాట్రాయి: మండలంలోని కొత్తగూడెం గ్రామంలో రీసర్వే పూర్తయ్యిందని డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రీసర్వేలో భూ స్థితి, రికార్డు దాఖలపై కొన్ని అభ్యంతరాలు వచ్చాయని తెలిపారు. దీంతో గురువారం నూజివీడు సబ్‌కలెక్టర్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తగిన ఆధారాలతో గ్రామసభకు రావాలని ఆయన కోరారు.

10న విద్యుత్ అదాలత్

నూజివీడు: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నూజివీడులోని జీపీ గ్రాండ్ కల్యాణ మండపంలో విద్యుత్ వినియోగదారుల అదాలత్‌తో పాటు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఎ.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ బిల్లులకు సంబంధించి, నూతన సర్వీసులు, వ్యవసాయ సర్వీసులు, ఇతర సమస్యలు ఏమైనా ఉంటే రాతపూర్వకంగా అందజేయాలని ఆయన కోరారు.

జీఎస్టీ 2.0తో ప్రజలకు లబ్ధి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో భార్గవి

ఆగిరిపల్లి: జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా ప్రజలకు అనేక విధాలుగా లబ్ధి కలుగుతుందని ఎంపీడీవో బి.భార్గవి తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో 'దేశ నిర్మాణంలో.. విద్యారంగంలో జీఎస్టీ ప్రాధాన్యం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, ఎలోక్యూషన్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలిచిన విజేతలను భార్గవి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 శిలారపు హేబేలు, ఎంఈవో-2 కొవ్వలి ఆనంద్ కుమార్, హెచ్‌ఎం పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అండతోనే నకిలీ మద్యం తయారీ



నిరసన వ్యక్తం చేస్తున్న బాబురావు

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం అండతో నకిలీ మద్యం రాకెట్ జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు ఆరోపించారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం ప్రాంతాలలో బట్టబయలైన నకిలీ మద్యం రాకెట్‌పై సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద మంగళవారం మద్యం సీసాలు పగులగొట్టి నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి పాలనలో గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు దొరకడం లేదని, నకిలీ మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. మద్యం కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్‌సీహెచ్. శ్రీనివాస్, అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కె.సరోజ, సీపీఎం కొండపల్లి పట్టణ కార్యదర్శి మహేష్ , సీనియర్ నేత విటల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి గర్హనీయం



తిరువూరు కోర్టు ఎదుట ఆందోళన చేస్తున్న న్యాయవాదులు



తిరువూరు ఎస్‌ఆర్ టవర్స్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన

తిరువూరు: భారత ఉన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి సంఘటన గర్హనీయమని అఖిలభారత న్యాయవాదుల సంఘ జిల్లా కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్ ఖండించారు. మంగళవారం తిరువూరు కోర్టు ఎదుట న్యాయవాదులు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించే ఉన్నత న్యాయస్థాన చీఫ్ జస్టిస్‌పై కోర్టు హాలులో దాడి జరగడం ఆందోళన కలిగించే విధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులు మేకల రవి, మరసకట్ల కుమార్, రాజేంద్రబాబు, మాలావ త్ రాము, సుబానీ, రాంబాబు, నరసయ్య, నాగ రాజు, ఆనందస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్ న్యాయవాదిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నాగేంద్రప్రసాద్ కోరారు. స్థానిక ఎస్‌ఆర్ టవర్స్ సెంటర్లో గవాయ్‌పై దాడిని నిరసిస్తూ తిరువూరులో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, బి.వెంకటేశ్వరరావు, ఎస్వీ భద్రం, ఆకుల రవి, పి.శ్రీనివాసరావు, పి.సురేష్, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు పల్లెపాటి శ్రీనివాసరావు తదితరులు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించారు.

ఇబ్రహీంపట్నం: భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి అమానుష చర్య అని ఏపీ ఎమ్మార్పీఎస్ అమరావతి అధ్యక్షుడు మందా నాగమల్లేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఇబ్రహీంపట్నం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో అడ్వకేట్ రాకేష్ తీరును మంగళవారం ఆయన తప్పుబట్టారు.

విస్సన్నపేట: భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి హేయమైన చర్య అని సీపీఎం మండల కార్యదర్శి వి.నాగరాజు అన్నారు. దాడిని ఖండిస్తూ స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మేకల జ్ఞానరత్నం, నాయకులు ఏడుకొండలు, సత్యనారాయణ, రాము, సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కనులపండువగా గరుడసేవ

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి గరుడసేవ కార్యక్రమాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా అలివేలు మంగా పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ గరుడ వాహనంపై స్వామి, అమ్మవారిని మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్త హనుమేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నెమలి గోపాలుడికి మాస కల్యాణం



కల్యాణ క్రతువులో అర్చకులు

తిరువూరు: నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ఆశ్వీయుజ పౌర్ణమి సందర్భంగా స్వామివారి మాస కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా జరిపారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, ఈవో సంధ్య పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి కల్యాణం వీక్షించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): గత మూడు రోజులుగా మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా నిలిచిపోయిన మంచినీటి సరఫరా సమస్యను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పరిష్కరించాలని కొండపల్లి మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ గుంజా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఎన్‌టీటీపీఎస్ అధికారులు బూడిద నీరు కృష్ణా నదిలోకి విడుదల చేయడంపై వారి తీరును మంగళవారం ఓ సమావేశంలో ప్రశ్నించారు. అధికారులు సైలోలు నిండిన బూడిదను లారీల ద్వారా బయటకు తరలించే సమయంలో అక్కడ నిలిచిన బూడిదను వాటర్ ద్వారా కృష్ణా నదిలోకి విడుదల చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ఆందోళన చేపట్టినప్పటికీ అధికారుల్లో మార్పు రాలేదని మండిపడ్డారు. బూడిద నీరు తాగి అనారోగ్యాల భారిన పడిన కుటుంబాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఆటల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

నూజివీడు: క్రీడలు విద్యార్థుల్లో శారీరక, మానసిక ధృఢత్వాన్ని, పోటీతత్వాన్ని పెంపొందించడానికి దోహదపడతాయని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ ఇన్‌చార్జి హెచ్‌ఎం డొక్కు శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సెయింట్‌థామస్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నూజివీడు మండల స్థాయి బాలుర ఆటల పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించడం ద్వారా జాతీయ స్థాయి, ప్రపంచ స్థాయి గుర్తింపును పొందవచ్చన్నారు. విజేతలు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని వివరించారు. సెయింట్‌థామస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ బ్రదర్ కిషోర్‌కుమార్, పీడీలు పి.రవీంద్ర, ఆలీఖాన్, స్వప్న, సరళ, రాణి, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్మవ్యాధితో బాధపడుతున్న వీధి కుక్కలు



ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో వీధి కుక్కలు అంతు పట్టని చర్మ వ్యాధితో అవస్థలు పడుతున్నాయి. కుక్కల చర్మంపై మచ్చలు ఏర్పడి వెంట్రుకలన్నీ ఊడిపోవడం, దద్దుర్లు రావడం, పుండ్లు ఏర్పడిన శరీరంతో జుగుప్సాకరంగా తిరుగుతున్నాయి. ఇలాంటి కుక్కలను చూసి జనం ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఆగిరిపల్లి పశువైద్యాధికారి హనుమంతరావును సంప్రదించగా.. ప్యారాసైట్ ఇన్ఫెస్టేషన్ వ్యాధి అని పేర్కొన్నారు. ఈ వ్యాధి సోకిన కుక్కలకు వ్యాధి నివారణ కోసం డెర్మటైటిస్ ఐవర్ మెక్టిన్ ఇంజక్షన్లు వారం రోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వీధి కుక్కలకు ఇంజక్షన్ చేయాలంటే డాగ్ క్యాచర్లు అందుబాటులో ఉండాలని తెలిపారు. అయితే వ్యాధితో ఇబ్బంది పడుతున్న కుక్కలను తాకితే మనుషులకు కూడా ఇన్ఫెక్షన్ సోకే అవకాశం ఉందని, ముఖ్యంగా చిన్నపిల్లలును వాటికి దూరంగా ఉంచాలని తెలిపారు.

కళాశాలలో యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల ఫెన్సింగ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. కృష్ణా విశ్వ విద్యాలయం పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలల విద్యార్థులు 60 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. నాకౌట్ కం లీగ్ పద్ధతిలో నిర్వహించిన ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి ప్రారంభించారు. టోర్నమెంట్‌కు సెలక్షన్ కమిటీగా శివకుమార్, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల కైకలూరు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి లక్ష్మణ్‌లు పాల్గొన్నారు. మొదటి రోజు ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల అనంతరం కృష్ణా యూనివర్సిటీ విద్యార్థుల జట్టును ఎంపిక చేస్తామని.. యూనివర్సిటీ జట్టు ఆల్ ఇండియా పోటీలకు వెళుతుందని ప్రిన్సిపాల్, ఆర్గనైజింగ్ ప్రసిడెంట్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు.

పింఛను పంపిణీ నుంచి అంగన్‌వాడీలను మినహాయించాలి



ఎంపీడీవో అనురాధకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

మైలవరం: కూటమి ప్రభుత్వం వాలంటరీ వ్యవస్థను తొలగించడంతో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొంటున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ సుధాకర్ తెలిపారు. మైలవరం మండలంలో 36 మంది అంగన్‌వాడీలు పింఛన్ల పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అంగన్‌వాడీలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని.. తక్షణమే అంగన్‌వాడీ కార్యకర్తలను రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ నుంచి మినహాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని ఎంపీడీవో అనురాధకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది రామకృష్ణ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న జడ్జి శైలజ, న్యాయవాదులు

మైలవరం: సీనియర్ న్యాయవాది, మైలవరం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పజ్జూరు రామకృష్ణ మృతి తీరని లోటని బార్ అసోసియేషన్ అధ్యక్షులు రావూరి రమేష్‌బాబు తెలిపారు. మైలవరంలో సీనియర్ న్యాయవాది పజ్జూరు రామకృష్ణ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు మంగళవారం ఉదయం రామకృష్ణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మైలవరం కోర్టు హాలులో ఏర్పాటు చేసిన సంతాప సభలో జడ్జి ఎం.శైలజ, న్యాయవాదులు పాల్గొని రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పీవీ శేషగిరి రావు, ఎస్‌వీకే సత్యనారాయణరావు, బుద్ధవరపు వెంకట్రావు, వీటీ కిశోర్, మైలవరం కోర్టు ఏజీపీ ఏడీ ప్రసాద్, ఎం.ఆంజనేయులు, ఓర్సు శ్రీనివాస రావు, ముల్లంగి రవికుమార్, పీవీ సాంబశివరావు, ఎం.శరత్‌బాబు, బి.దినేష్, ఎం.తనూజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఆటల పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు

నూజివీడు: మండల స్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. ఖోఖో జూనియర్స్‌లో జి.లిఖిత్, ఎస్.నవతేజ్, ఖోఖో సీనియర్స్‌లో ఎస్.ప్రణవ్, కె.ఉదయ్, కబడ్డీ జూనియర్ విభాగంలో జి.యశ్వంత్, సీనియర్స్ విభాగంలో ఎస్.వివేక్, డి.ఉమామహేశ్వరసింగ్, ఎ.మనోజ్, షటిల్ జూనియర్స్‌లో ఎ.మోక్షజ్ఞ, సీనియర్స్‌లో ఎం.నిహంత్‌కుమార్, వాలీబాల్ జూనియర్స్‌లో నాగ హృదిక్, ఎ.మోక్షజ్ఞ, సీనియర్స్‌లో ఆర్.ఇషాక్, ఎస్.రామ్ చరణ్, సీహెచ్ రాహుల్, యోగా సీనియర్స్‌లో ఎం.రాజా ఎంపికయ్యారు. వీరంతా త్రివిధ స్కూల్‌లో చదువుతున్నారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మంగళవారం తెలిపారు.